క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



తనుగుల రమేశ్

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మంజులా పూర్‌కు చెందిన తనుగుల రమేశ్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. రమేశ్ స్థానికంగా కూరగాయలు విక్రయించడంతోపాటు పెయింటర్‌గా జీవనం సాగిస్తుండేవాడు. వారం కిందట ఇంటి నుంచి వెళ్లిన రమేశ్ తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లు, సమీప గ్రామాల్లో వెతికినా జాడ తెలియలేదు. అతడి భార్య మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీడీసీ నూతన కార్యవర్గం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో మంగళవారం వీడీసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనుగందుల యోగేశ్, ఉపాధ్యక్షుడిగా నర్సయ్య, కోశాధికారిగా గంగారెడ్డి, రైటర్‌గా సూర్యవంశీ సాయి, సభ్యులుగా శంకర్, కిష్టయ్య, లక్ష్మణ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వీరిని ఘనంగా సన్మానించారు.

మండపాల వివరాలు నమోదు చేసుకోండి

కుంటాల: నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వినాయకుడి మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఓలా గ్రామంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ కనీష్ ఫాతిమా, ఎంపీటీసీ కట్ట రవి, ఉపసర్పంచ్ రాంజీ, సభ్యులు హైమద్ పాషా, నాలం మహేశ్, కృష్ణ, సాయికుమార్ పాల్గొన్నారు.

31లోగా దరఖాస్తు చేసుకోండి

కుంటాల: పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కల్గిన రైతులు ఈనెల 31లోగా ఎంపీడీవో, ఉద్యానవన, వ్యవసాయశాఖల అధికారుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో గట్టుపల్లి నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల్లోపు భూమి, జాబ్‌కార్డు కల్గిన రైతులు అర్హులని పేర్కొన్నారు. మామిడి, నిమ్మ, జామ, నారింజ, సీతాఫలం, సపోట, నేరేడు, దానిమ్మ, మునగ, జీడి మామిడి, ఆయిల్‌పాం, ఆపిల్ బేర్ మొక్కలను అందిస్తామని.. పూర్తి వివరాలకు 99496 66354 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

భూమిపూజ చేసిన ఎమ్మెల్యే

ఖానాపూర్: మండలంలోని రాజురలో సోమవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రేఖానాయక్ భూమిపూజ చేశారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో శెట్టి సంజీవ్, తదితరులు ఉన్నారు.

ఘనంగా మక్కా కాంకిడి



పూజలు చేస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: పట్టణంలోని బత్తిస్‌ఘడ్ ప్రాంతంలోని ఉన్న కాల భైరవస్వామి ఆలయంలో మంగళవారం భవాసర్ క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో మక్కా కాంకిడి పండుగ ఘనంగా నిర్వహించారు. ఏటా వినాయక చవితి తర్వాత భవాసర్ సమాజ్ వారు ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు డి.శ్రీనివాస్, అధ్యక్షుడు అంబేకార్ విజయ్, ఉపాధ్యక్షుడు ముదుల్కర్ భూమన్న, కోశాధికారి రాహుల్, సభ్యులు సురేశ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: మామడ మండలం పొతారం గ్రామ ఉపసర్పంచ్ సుంచు శ్రీనివాస్, మాజీ వార్డుసభ్యులు సారంగాపూర్ మండలం భజరంగ్‌దళ్ యూత్ అధ్యక్షుడు ఆర్మూర్‌సాయి కుమార్, అరె శ్యామ్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. లింగారెడ్డి, బాపురెడ్డి, రాజారెడ్డి, లింగంయాదవ్, అశోక్, మల్లయ్య, శ్రీనివాస్‌చౌహాన్, విలాస్, ఎంపీటీసీ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ కన్వీనర్‌గా విలాస్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా గాదె విలాస్‌ను నియమిస్తూ మంగళవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఆయనకు జిల్లా కేంద్రంలో మహేశ్వర్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, రాజేందర్, అరవింద్, మంగ పాల్గొన్నారు.

సోయా పంట పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామంలో సోయాబీన్ పంటలను మంగళవారం ఏఈఓ భాగ్యలక్ష్మి పరిశీలించారు. కాండపు ఈగ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.

కొలువుదీరిన బొజ్జ గణపయ్య



కడెం రామాలయంలో..



కుంటాలలో గణేశుడికి పూజలు చేస్తున్న యువకులు



భైంసారూరల్: మాటేగాంలో రామారావ్ పూజలు



తానూరు: ఎల్విలో గణనాథుడి వద్ద భక్తులు

వినాయక చవితి నేపథ్యంలో జిల్లాలో ప్రతి వీధిలో గణనాథుడు కొలువుదీరాడు. మండపాలను భారీ సెట్లతో ఏర్పాటు చేసి పూలు, లైట్లతో అలంకరించారు. నిర్మల్ పట్టణంలోని మండపాల్లో ఏర్పాటు చేసిన ప్రతిమలు ఆకట్టుకున్నాయి. కొందరు ఇళ్లలో స్వామివారి ప్రతిమలు ఏర్పాటు చేశారు. భక్తులు తమ కోరికలు తీర్చాలని స్వామివారికి దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ప్రధాన కూడళ్లు, వీధుల్లో సందడి నెలకొంది. సోన్‌లోని బ్రహ్మణ గణేశ్ మండలి వద్ద ధన్వంతరి, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. లక్ష్మణచాంద మండలంలో ఎంపీపీ పద్మ గోమయ వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఈటెల కవిత–శ్రీనివాస దంపతులు 111 మట్టి విగ్రహాలను గ్రామస్తులకు వితరణ చేశారు. భైంసా మండలంలోని మాటేగాం గ్రామంలో కొరడి గణపతి వద్ద బీజేపీ నాయకులు రామారావ్ పటేల్ పూజలు చేశారు. భైంసా గోపాలకృష్ణ మందిర్‌లో సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేశుడి పూజలో భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, సీఐ శ్రీను, ఎస్సైలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



లక్ష్మణచాందలో గోమయ గణనాథులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ పద్మ



జిల్లా కేంద్రంలోని ఫారెస్టు కార్యాలయంలో..



సారంగపూర్: జామ్‌పెద్దూర్‌లో భక్తుల పూజలు



ముధోల్‌లో..



ఖానాపూర్‌లో పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్



భైంసాలో పూజలు చేస్తున్న ఏఎస్పీ కాంతిలాల్

తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- సీడబ్ల్యూసీ సభ్యుడు గణేశ్

ఖానాపూర్: కర్ణాటక రాష్ట్రం తరహాలో తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని సీడబ్ల్యూసీ సభ్యుడు, ఉత్తరాఖండ్ ఎమ్మెల్యే జి.గణేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తుక్కుగూడ విజయభేరి సభ విజయవంతమైందని.. రోజురోజుకూ కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందన్నారు. అనంతరం విజయభేరి సభలో ప్రవేశపెట్టిన ఆరు హామీలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

వెడ్మ బొజ్జు, భరత్‌చౌహాన్, చారులత రాథోడ్, చంద్రశేఖర్, రాంకిషన్‌నాయక్, దయానంద్, యూసుఫ్‌ఖాన్, గంగనర్సయ్య, చిన్నం సత్యం, రమేశ్, సతీశ్‌రెడ్డి, ముజాఫర్, తదితరులు ఉన్నారు.

భీంరెడ్డి సేవలు చిరస్మరణీయం

లక్ష్మణచాంద: నియోజకవర్గంలో పేదలకు ఇళ్లస్థలాలు, వ్యవసాయ భూములు పంపిణీ చేయడంలో కీలకపాత్ర పోషించిన అయిండ్ల భీంరెడ్డి సేవలు మరువలేనివని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో భీంరెడ్డి వర్ధంతి నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్, నిర్మల్ ఎమ్మెల్యేగా ఆయన చేసిన అభివృద్ధిని కొనియాడారు. వారి కుటుంబసభ్యులు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు


భూపాల్‌రెడ్డి, స్వర్ణారెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ రవికుమార్, మునిపెల్లి సర్పంచ్ పద్మ, లింగారెడ్డి, ఉపసర్పంచ్ రమేశ్, సయ్యద్ పాల్గొన్నారు.

మండల అభివృద్ధిపై నివేదికలు ఇవ్వండి

పెంబి: మండలంలో జరుగుతున్న అభివృద్ధిపై అన్ని శాఖల అధికారులు నివేదికలు ఇవ్వాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. మంగళవారం పెంబిలో ఎంపీడీవో కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం తీసుకుంటున్న వారి వివరాలు, వైద్య,ఆరోగ్యశాఖ ద్వారా ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలతోపాటు, పశువైద్యాధికారి అందిస్తున్న సేవలపై నివేదికలు ఇవ్వాలని కోరారు. మండలంలో ఉపాధికార్డుల వివరాలు, ఇప్పటివరకు నిర్మించిన ఇంకుడుగుంతలు, మరుగుదొడ్ల వివరాలు, వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు తీసుకున్న రైతుల వివరాలతో కూడిన నివేదికలు తయారు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో రత్నాకర్ రావు, రవి, ఏపీవో రాజశేఖర్, ఏపీఎం గంగారెడ్డి, సీడీపీవో సరిత, ఇరిగేషన్ ఏఈఈ ఉదయ్, భగీరథ ఏఈఈ విష్ణు, పశువైద్యాధికారి విజయ్ జాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖానాపూర్: చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం చారిత్రక విజయమని పెంబి జెడ్పీటీసీ జానుబాయి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ నాయకులతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు పడాల రాజశేఖర్, నాయిని సంతోష్, తోకల బుచ్చన్న, బి.మల్లయ్య, ఆనంద్, స్వామి, సుధాకర్, నల్లూరి శ్రీధర్, ఉపేందర్, శ్రావణ్, మనోజ్, సాయికృష్ణ, రూప, సోని, రోహిణి, సురేందర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానుబాయి

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

భైంసాటౌన్: మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు గడపాలే ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భైంసాలో బస్టాండ్ ఎదుట అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా పంచలోహ విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. భారతీయ బౌద్ధ మహాసభ పదాధికారులు, బౌద్ధ ఉపాసకులు, తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీఎస్‌ఐ నేతలు

అవార్డు గ్రహీతలకు సన్మానం

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కళాకారుల సంఘ భవనంలో సోమవారం అవార్డు గ్రహీతలను సన్మానించారు. సౌత్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు గ్రహీత షేక్ అన్సర్ పాషా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన దాసండ్ల అంజయ్య, తాళ్ల నర్సయ్యతోపాటు అగ్నిమాపకశాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన తునికి హరికృష్ణను ఘనంగా సన్మానించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల చిన్నయ్య, రమేశ్, సామర్ల రాజన్న, డీఎల్‌ఎన్ చారి, రమేశ్ పాల్గొన్నారు.

'నాసిరకంగా భగీరథ పనులు'

ఖానాపూర్: ఇష్టారాజ్యంగా మిషన్ భగీరథ పైపులైన్ పనులు చేపట్టడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోశ్, నాయకులు లాండేరి కిషన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులను పరిశీలించారు. నాసిరకం పనులు చేపట్టిన కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంఘం శరణం గచ్ఛామి కళారూపం ప్రదర్శన

ముధోల్: మండల కేంద్రంలోని బసవ గార్డెన్‌లో సోమవారం రాత్రి తెలంగాణ సాంఘీక సంక్షేమ శాఖ సౌజన్యంతో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంఘం శరణం గచ్ఛామి కళా రూపం ప్రదర్శించారు. అంబేద్కర్ జీవిత ఆశయాలు, లక్ష్యాలు, కష్టాలు కళ్లకు కట్టినట్లుగా చూపించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బహుజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోబర్‌గ్యాస్ పనులు పరిశీలన

తానూరు: మండలంలోని ఎల్వత్ గ్రామంలో జరుగుతున్న గోబర్ గ్యాస్ నిర్మాణ పనులను మంగళవారం ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. పనులను సత్వరం పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. టీఏ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'అందని ద్రాక్షగా వైద్యం'

ఖానాపూర్: పట్టణంలో సర్కారు వైద్యం నిరుపేదలకు అందని ద్రాక్షగా మారిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేరుకే ఖానాపూర్ పెద్ద ఆస్పత్రి అని.. ఇక్కడ కనీసం ఎక్స్‌రే, పిల్లల డాక్టర్, ఇతర సౌకర్యాలు కరువయ్యాయని పేర్కొన్నారు. సౌకర్యాలు కల్పించి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని కోరారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. వారి వెంట రాజన్న, రాజేశ్, బాబన్న, సతీశ్, నరేశ్, తదితరులు ఉన్నారు.

విధుల నుంచి తొలగించాలని ఫిర్యాదు

లోకేశ్వరం: రుణాలు ఇప్పిస్తానని స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న మండలంలోని రాజూరకు చెందిన సీఏ ఆర్ల రాణిని విధుల నుంచి తొలగించాలని అదే గ్రామానికి చెందిన పలు సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఏపీఎం మల్లేశ్, ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భూమారావులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని ముగ్గురు గ్రూపు సభ్యుల ఖాతా నుంచి రూ.లక్షా యాభై వేలను వారి తమ్ముడు ఖాతాల్లో జమ చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రూపుల సభ్యులు ఉన్నారు.

నేడు ఫిర్యాదుల పరిష్కార వేదిక

నిర్మల్‌రూరల్: నిర్మల్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక బుధవారం మండలంలోని అక్కాపూర్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు ఏఈ కిశోర్ తెలిపారు. దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, సారంగపూర్, నిర్మల్ మండలాల పరిధిలో విద్యుత్ సమస్యలుంటే సంప్రదించాలని సూచించారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఈశ్వరయ్య హాజరవుతారని.. వినియోగించుకోవాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

లక్ష్మణచాంద: ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అడ్వాల పద్మ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు రావాలిన కోరారు.

జోనల్‌స్థాయి పోటీలకు ఎంపిక

ముధోల్: మండల కేంద్రంలోని రబీంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థిని జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని అక్షయ ప్రతిభ కనబరిచి జోనల్‌స్థాయికి ఎంపికైంది. ఈసందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

'ఇంటి స్థలం ప్రకటించడం హర్షనీయం'

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తామని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రకటించడం హర్షనీయమని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

'సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం'

ఖానాపూర్: పట్టణ పరిధిలోని సమస్యలు పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని 12వ వార్డు కౌన్సిలర్ ఫౌజియాబేగం అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాలనీల్లో పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నా.. అధికారులెవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికీ స్పందించకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామాన్ని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దడం అభినందనీయమని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. ఇటీవలే స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 అవార్డును అందుకున్న సర్పంచ్ గంగన్నను సోమవారం ఖానాపూర్‌లో శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అలెగ్జాండర్ తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన



లక్ష్మణచాందలో నిరసన తెలుపుతున్న సిబ్బంది



కుంటాలలో..

సారంగపూర్/లక్ష్మణచాంద/కుంటాల: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ఈ మేరకు మంగళవారం సారంగపూర్, లక్ష్మణచాంద, కుండాల మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే తమ డిమాండ్లు నెరవేర్చాలని పళ్లాలు, గరిటెలు పట్టుకొని ఆందోళన చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్వరూప, లలిత, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, పద్మ, గంగామణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన హెచ్‌ఎంలు

సోన్: మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల్లో బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. సోన్ జెడ్పీఎస్‌ఎస్‌లో కె.ఆరాధన, న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీఎస్‌ఎస్‌లో ఎన్.విద్యాసాగర్, మాదాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో ఎం.శ్రీనివాస్, పాక్‌పట్ల జెడ్పీఎస్‌ఎస్‌లో ఎన్.వెంకన్న, కడ్తాల్ జెడ్పీఎస్‌ఎస్‌లో కె.వెంకటేశ్వర్, సిద్ధులకుంట జెడ్పీఎస్‌ఎస్‌లో బి.హరీశ్‌రెడ్డి, వెంగ్వాపేట జెడ్పీఎస్‌ఎస్‌లో ఎం.గజ్జారం ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు.

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడుగా చంద్రకాంత్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను పీఆర్‌టీయూ సభ్యులు ఘనంగా సన్మానించారు.



సోన్: న్యూవెల్మల్‌లో హెచ్‌ఎం వద్ద సిబ్బంది

గంగమ్మ ఒడికి గణేశుడు..



భైంసాటౌన్: నిమజ్జనం చేస్తున్న భక్తుడు



కుంటాల: నిమజ్జనం కోసం వెళ్తున్న గణనాథుడు

భైంసాటౌన్: పట్టణంలో మంగళవారం పలుచోట్ల గణనాథుడి నిమజ్జనం నిర్వహించారు. ఇళ్లలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలను స్థానిక గడ్డెన్న వాగు ప్రాజెక్టు నీటిలో నిమజ్జనం చేశారు.

కుభీర్: మండలంలోని కుప్టి గ్రామంలో మంగళవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కుభీర్‌లో ఆర్యవైశ్యులు బాజాభజంత్రీలతో ఊరేగింపుగా వెళ్లి సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు.

మట్టి విగ్రహాలు పంపిణీ

భైంసాటౌన్: పర్యావరణహితమే సమాజ హితమని విశ్వహిందూ పరిషత్ సభ్యులు అన్నారు. వినాయక చవితి నేపథ్యంలో సోమవారం పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో మహిష(భైంసా)శాఖ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. డాక్టర్ విజయానంద్, వర్ష దంపతులు దివ్యాంగశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచగుడి మహేశ్, పలువురు స్వచ్ఛందంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. అనంతరం మండపాల్లో గణనాథుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు.

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. తపస్ రాష్ట్ర బాధ్యులు శశిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్, జిల్లా బాధ్యులు ప్రభాకర్, అఖిలేశ్ కుమార్‌సింగ్, రమేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.